వైసిపి నేతల్లో గుబులు



◆ ఖరారు కాని వారు విజయవాడలో చక్కర్లు ◆ టిక్కెట్టు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు

వైసిపి నేతల్లో గుబులు నెలకొంది. మొన్నటి వరకు ధీమాగానున్న నేతలు కూడా ఇప్పుడు టిక్కెట్టు వస్తుందా రాదా అన్న ఆందోళనలోనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పెద్దఎత్తున మార్పులు తీసుకురాబోతోందన్న ప్రచారం నడుస్తోంది. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే కొన్ని మార్పులు చేపట్టింది. మిగిలిన నియోజక వర్గాల్లోనూ మార్పులతో జాబితాలను విడుదల చేయనుంది. దీంతో సమన్వయకర్తలను కొత్తగా నియమించని నియోజకవర్గాల నేతలు విజయవాడలో వైసిపి ముఖ్య నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఏదో రకంగా ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అధిష్టానం ఇటీవలే నియోజకవర్గాల సమన్వయకర్తల పేరుతో రెండో జాబితాను విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ స్థానాలకు కొత్త సమన్వయకర్తలను నియమించింది. ఇదివరకే హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్తను కొత్తగా నియమించారు. ఈ రకంగా మొత్తం నాలుగు అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు కొత్త సమన్వయకర్తలు వచ్చేశారు. ఇక మిగిలింది పది అసెంబ్లీ నియోజకవర్గాలు. ఇందులో ఎటువంటి మార్పులు ఉంటాయన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

విజయవాడలో మకాం..

టికెట్టుపై సందేహమున్న వైసిపి ముఖ్య నేతలు విజయవాడలోనే మకాం వేసి తిరిగి దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేసుకునే పనిలోనున్నారు. టిక్కెట్టు లేదని తేలిపోయిన నేతలు కూడా మరో చోట అవకాశం ఏమైనా ఉందా అని వెతుక్కునే పనిలోపడ్డారు. హిందూపురం పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్‌కు అవకాశం లేదని తేలింది. బళ్లారికి చెందిన శాంతను ఆయన స్థానంలో తీసుకని వచ్చారు. అయితే తనకు అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏదోక చోట అసెంబ్లీ టిక్కెట్టు ఇవ్వాలని ముఖ్య నేతలను మాధవ్ అడుగుతున్నట్టు ప్రచారం నడుస్తోంది. దీనిపై బాహాటంగా ఆయన ఎక్కడా స్పందించలేదు. ఇక రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కూడా విజయవాడలోనే మకాం వేశారు. ఆయన్ను రాయదుర్గం నుంచి తప్పించి కళ్యాణదుర్గంకు పంపుతారని గతంలో ప్రచారం జరిగింది. ఇటీవల రెండవ జాబితా ప్రకటించిన సందర్భంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్యను కళ్యాణదుర్గం సమన్వయకర్తగా ప్రకటించారు. దీనికి తోడు రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అని కూడా ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే కాపు భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు ముఖ్య నేతల చుట్టూ కాపు తిరుగుతున్నారు. ఇక ఎస్సీ రిజర్వు స్థానాలైన శింగనమల, మడకశిర రెండు చోట్లా మార్పు ఉంటుందని ప్రచారం నడుస్తున్న నేపథ్యంలో ఆ నేతలు కూడా ఏదో రకంగా మూడో జాబితాలో చోటు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేపడుతున్నారు. పుట్టపర్తి పరిస్థితి ఇంచుమించు ఇదే రకంగా ఉంది. కొత్తగా నియోజకవర్గ సమన్వయకర్తల నియామకం జరిగిన నాలుగు నియోజకవర్గాలు కాకుండా తక్కిన అన్ని చోట్ల ఎటువంటి మార్పులుండనున్నాయన్న గుబులు మాత్రం అక్కడి నేతలందరిలోనూ నెలకొంది. పైకి తమ స్థానం పదిలమని చెబుతున్నప్పటికీ లోలోనమాత్రం ఆందోళన నెలకొంది. అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని భయపడుతున్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శంకర్‌రావు

ప్రజాశక్తి కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ

పెనుకొండ : ప్రజాశక్తి కోర్టు క్యాలెండర్‌ను పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి శంకర్‌రావు ఆవిష్కరించారు. గురువారం పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జ్ ఛాంబర్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజా సమస్యలను వెలికి తీయడంలో చేస్తున్న కషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్, ప్రజాశక్తి విలేకరులు నాగార్జున, నవీన్, రామంజి, న్యాయవాదులు శ్రీరాములు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

పెనుకొండ : వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాగ్రహాన్ని తట్టుకోలేకనే వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపిలు ఆ పార్టీకి గుడ్ బై చెబుతున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని అధికార పార్టీ ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తున్నారన్నారు. వైసిపిలోని చాలా మంది ఎంపిలకు వారి రాజకీయ భవితవ్యం అర్థం కావడం లేదని, వైసిపిని నమ్ముకుంటే రాజకీయ భవిష్యత్తు అంధకారమే అని భావించి పార్టీ మారుతున్నారన్నారు. జగన్ పాలనలో ఎపి అభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఎమ్మెల్యేలు, ఎంపిల నియోజకవర్గాలు మార్చుతున్నారన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్, సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయాలని వామపక్ష పార్టీలు, ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈమేరకు గురువారం వారు ఆర్అండ్‌బి అధికారికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యా సంస్థల వద్ద విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వాహనాలు వేగంగా వెళ్తుండడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్ బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో గ్రామాలకు వెళ్లే మలుపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్, సిపిఐ ఇన్‌ఛార్జి ఆర్‌జి పవిత్ర, కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఉమేష్‌నాయక్, ఐసా జిల్లా అధ్యక్షులు శివకుమార్ ఉన్నారు.

భూరక్ష పట్టాదారు పాసుపుస్తకాల అందజేత

రొద్దం : మండల పరిధిలోని బూచర్ల గ్రామంలో గురువారం 'జగనన్న భూరక్ష పట్టాదారు పాసు పుస్తకా ల పంపిణీ' కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి చంద్రశేఖర్ రైతులకు భూరక్ష పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ సాహసోపే తమైన నిర్ణయం తీసుకుని భూ సమగ్ర సర్వే చేయించారన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూములకు పట్టా పాస్ బుక్కులు మంజూరు చేయించి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచి సోమిరెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, డీలర్ ముత్యాలు, నారాయణప్ప, సచివాలయ సిబ్బంది, విఆర్ఒ సూర్యనారాయణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెరిగి పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం అమలు తీరుపై గృహ నిర్మాణ శాఖ డిఈ, ఏఈలు, వివిధ ఏజెన్సీలతో గురువారం నాడు కలెక్టరేట్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, హౌసింగ్ ఓఎస్‌డి చంద్రమౌళి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రషీద్ ఖాన్, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, మెప్మా అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సంతప్తి స్థాయిలో అందించాలనే లక్ష్యం మేరకు అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం పనులు ఈనెల 30వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ డ్రైవ్‌లో ఇప్పటికే ప్రారంభించిన 20,965 వేల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆ శాఖ ఇంజినీర్ అధికారులను ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయంలోని అసిస్టెంట్లు, వార్డు సెక్రటరీలు రానున్న రెండు నెలలు జగనన్న ఇళ్ల నిర్మాణం ప్రగతిపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సిమెంటు, ఇనుముకు ఎటువంటి కొరతా లేదన్నారు. ధర్మవరం, మడకశిర, హిందూపురం, కదిరి నియోజకవర్గం నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు మరుగుదొడ్లు ఉండే విధంగా ప్రణాళికలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 65,609 ఇళ్లను నిర్మించడానికి ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గృహ నిర్మాణ శాఖ అధికారులు ఏఈలు, డిఇలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 10వ రోజు కొనసా గింది. ఈ సందర్భం గా కార్మికులు నడుముకు ఆకులు చుట్టుకుని గడ్డిని తింటూ నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడు తూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికసంఘం గౌరవ సలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేశు, ఉపాధ్యక్షులు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుంద, అద్రామహేశ్, బొగ్గు నాగరాజు, సాకే బాబు, కోశాధికారి అనిల్ కుమార్, దాసరి సురేశ్, అంకే పెద్దన్న పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా చెట్టు కొమ్మలు ఆకులు కట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. సిఐటియు పట్టణ కార్యదర్శి గంగాధర్ తో పాటు కార్మిక యూనియన్ నాయకులు మాట్లాడుతూ పది రోజులుగా తాము సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు నాగార్జున, నరసింహులు, గోవిందు, రామయ్య, పెద్దన్న, సాయి, బాబయ్య, రామక్క, అనిత పాల్గొన్నారు.

నేటి నుంచి తాగునీరు, వీధి దీపాలు బంద్

మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికులు శుక్రవారం నుంచి తాగునీరు సరఫరా, వీధి దీపాలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు. పది రోజులుగా పారిశుధ్యకార్మికులతో పాటు తాము కూడా సమ్మెలో పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అందుకే తాము శు క్రవారం నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ రామ్ భూపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, గణేష్, రామదాసు, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించక పోతే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ హెచ్చరించారు.కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు వారికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాంబ శివ, రాజప్ప, నాయకులు మల్లికార్జున, జగదీష్ పాల్గొన్నారు.

ధర్మవరంలో అర్ధనగ్నంగా ఆకులు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కదిరి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సిఎం జగన్ విఫలమ య్యాయని విమర్శించారు. రాష్ట్రాన్ని అంధకారం లోకి నెట్టిన వైసిపికి వంద రోజుల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

పనులు చేయిస్తే అడ్డుకుంటాం : పారిశుద్ధ్య కార్మికులు

హిందూపురం : పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ పారిశుధ్య కార్మికులతో పనులు చేయిస్తే అడ్డుకుంటామని ఈ విషయంలో కేసులకు భయపడే ప్రసక్తే లేదని మున్సిపల్ కార్మికులు తెగేసి చెప్పారు. గురువారం పర్మినెంట్ ఉద్యోగులతో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పారిశుధ్య పనులు చేయించడానికి ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కార్మికులు పనులను అడ్డుకున్నారు. దీంతో అధికారులకు, కార్మికులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయాన్ని కమిషనర్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సిఐ శ్రీనివాస్ నాయకులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. సమ్మెలో ఉన్న వారు సమ్మె చేసుకోవచ్చని, అయితే పర్మినెంట్ కార్మికులతో పనులు చేయిస్తే అడ్డుకోవద్దని చెప్పారు. ఒక వేళ పనులు అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయితే కార్మిక సంఘం నాయకులు పర్మినెంట్ ఉద్యోగులను ప్రస్తుతం ఎక్కడ పని చేస్తున్నారో అక్కడే పని చేయించాలని, అలా కాకుండా ఇతర ప్రాంతాల్లో పనులు చేయిస్తే అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

హాజరైన టిడిపి నాయకులు

'జయహో బిసి'కి పెనుకొండ నాయకులు

పెనుకొండ : మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో గురువారం అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో 'జయహో బిసి' కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, నియోజకవర్గ సీనియర్ నాయకులు కురుబ కృష్ణమూర్తి, పలువురు నాయకులు హాజరయ్యారు.

ఈవిఎంపై అవగాహన

గోరంట్ల రూరల్ : తహశీల్దార్ రంగనాయకులు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బస్టాండ్ సర్కిల్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవిఎం)పై రెవెన్యూ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవిఎం ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రణీత, విఆర్ఒలు మన్సూర్, సల్మాన్, అనిల్‌కుమార్, రంగనాథం పాల్గొన్నారు.

6న జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవం

◆ 71 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 86,142 మందికి డిగ్రీలు ప్రదానం

◆ ఆచార్య కె.బాలవీరారెడ్డికి గౌరవ డాక్టరేట్

◆ ముఖ్యఅతిథిగా హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి బొత్స సత్యనారాయణ, ఆచార్య వి.సత్యనారాయణ రాజు

◆ విలేకరులతో జెఎన్‌టియు విసి జి.రంగ జనార్ధన

విలేకరులతో మాట్లాడుతున్న విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు వైస్‌ఛాన్సలర్ జి.రంగజనార్ధన తెలిపారు. గురువారం నాడు అనంత జెఎన్‌టియు మెకానికల్ సెమినార్ హాల్‌లో రిజిస్ట్రార్ సి.శశిధర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ 13వ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, పోలవరం నిర్మాణ చీఫ్ కన్సల్టెంట్, అయోధ్య నిర్మాణ బోర్డు సభ్యుడు వి.సత్యనారాయణ రాజు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య కె.బాలవీరారెడ్డికి గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. 2021-22, 2022-23 విద్యాసంవత్సరాల్లో సాంకేతిక విద్యలో బీటెక్, బీఫార్మసీ పూర్తి చేసిన 68,963, ఎంటెక్ ఎం.ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన 16,914 కలిపి మొత్తం 86,142 మంది విద్యార్థులకు డిగ్రీలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 71 మంది విద్యార్థులకు బంగారు పతకాలను గవర్నర్ చేతుల మీదుగా అందించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే స్నాతకోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గవర్నర్ రాక సందర్భంగా పటిష్ట బందోబస్తు చర్యలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో తీసుకున్నారన్నారు. 13వ స్నాతకోత్సవంను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఎం.విజయకుమార్, పరీక్షల విభాగం డైరెక్టర్ ఈ.కేశవరెడ్డి, ఓటిపిఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ సురేష్ బాబు, ఆర్అండ్‌డి డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ, వర్సిటీ పిఆర్ఒ డాక్టర్ ఎం.రామ్‌శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీల ప్రదానంపై విసి సమీక్ష

జెఎన్‌టియు స్నాతకోత్సవం సందర్భంగా విద్యార్థులకు అందించే డిగ్రీలు, బంగారు పతకాలు, పిహెచ్‌డిలపై వర్సిటీ పరీక్షల విభాగం అధికారులతో గురువారం నాడు విసి రంగజనార్ధన సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు పరీక్షల విభాగంలో స్నాతకోత్సవం ఏర్పాట్ల గురించి ఆయన పరీక్షలు విభాగం డైరెక్టర్ ఆచార్య ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య చంద్రశేఖర్ రెడ్డితో చర్చించారు. గౌరవ డాక్టరేట్ తయారుచేసిన విధానం, డిగ్రీ పట్టాలను పరిశీలించారు. గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవంకు వస్తున్న సందర్భంగా ఎటువంటి లోటుపాట్లు జరగకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షల విభాగం డైరెక్టర్ కేశవరెడ్డి మాట్లాడుతూ 292 మంది విద్యార్థులకు పిహెచ్‌డి పట్టాలు, 71 మందికి బంగారు పతకాలు, 86,142 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్స్ జిఎస్ఎస్.రాజు, డాక్టర్ జె.శ్రీనివాసులు, వర్సిటీ పిఆర్ఒ డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు పటిష్ట చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటన నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 6వ తేదీన గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఎస్పీ బుక్కరాయసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల, అనంతపురం జెఎన్‌టియు ఆడిటోరియంలో ఏర్పాట్లను పరిశీలించారు. చేపట్టాల్సిన బందోబస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, డీఎస్పీలు జి.ప్రసాదరెడ్డి, బివి.శివారెడ్డి, బుక్కరాయ సముద్రం సిఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సిఐ వెంకటేష్ నాయక్, బుక్కరాయసముద్రం రెవెన్యూ, జెఎన్‌టియు అధికారులు ఉన్నారు.

'పురం' డీఎస్పీ కార్యాలయం దిగ్బంధం

ప్రవీణ్‌కుమార్ అరెస్టుపై అంగన్వాడీల నిరసన

డీఎస్పీ కార్యాలయం ఆవరణలో బైఠాయించిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-హిందూపురం

సిఐటియు నాయకులు ప్రవీణ్‌కుమార్ అరెస్టుకు నిరసనగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు పట్టణంలోని ఇందిరా పార్కు నుంచి ర్యాలీగా వెళ్లి డీఎస్పీ కార్యాలయాన్ని దిగ్బంధిం చారు. పోలీసులు ప్రధాన గేట్‌ను మూసేసినా చొచ్చుకొని లోపలికి వెళ్లి కార్యాలయం ఆవరణలో బైఠాయించారు. ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ చిలమత్తూరు మండలం కోడూరు సచివాలయంలో వినతి ఇవ్వడానికి వెళ్లిన అంగన్వాడీలపై దురుసుగా ప్రవర్తించిన సచివాలయ అడ్మిన్ సెక్రటరీపై విచారణ చేపట్టకపోగా అంగన్వాడీలకు అండగా నిలచిన సిఐటియు నాయకుడు ప్రవీణ్‌కుమార్‌పై అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. చిలమత్తూరు ఎస్ఐ ఉద్యోగం చేస్తున్నారో అధికార పార్టీ నాయకులకు ఏజెంట్‌గా పని చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వెంటనే సచివాలయ అడ్మిన్ సెక్రటరీపై ఎస్సీ ఎస్టీ కేసు, మహిళలపై దురుసుగా ప్రవర్తించిన కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఏకపక్షంగా వ్యవహరించిన చిలమత్తూరు ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని, 'చలో హిందూపురం' పిలుపునిచ్చి అంగన్వాడీలతో కలిసి డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. డీఎస్పీ అందుబాటులో లేకపోవడంతో రూరల్ సిఐ వేణుగోపాల్‌కు వినతి ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, కోశాధికారి సోమందేపల్లి శ్రీదేవి, ప్రాజెక్టు అధ్యక్షుడు కార్యదర్శులు, కోశాధికారి శోభ, లావణ్య, శిరీష, నాయకులు పెడబల్లి బాబా, రాజప్ప, ఆటో సంఘం నాయకులు బాబా, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

ప్రజాశక్తి -పెనుకొండ

షటిల్ ర్యాకెట్‌లను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, కలెక్టర్ అరుణ్‌బాబు

యువత విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని క్రీడలు యువజన సర్వీ సులు, రోడ్లు భవనాల శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న సూచించా రు. 'ఆడుదాం ఆంధ్ర'లో భాగం గా గురువారం ఆయన పట్టణం లోని పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వభరత్‌తో క్రీడా పోటీలను పరిశీలించారు. ప్రద్యుమ్న మాట్లాడుతూ క్రీడల్లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఇ సంజీవయ్య, డి.నాగరాజు, కమిషనర్ వంశీకృష్ణభార్గవ, ఎంపిడిఒ శివశంకరప్ప, తహశీల్దార్ సురేష్, ఎఇ వెంకటేష్ పాల్గొన్నారు.

కొండ రోడ్డు పరిశీలన

కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ప్రద్యుమ్న సందర్శించారు. కొండపై రోడ్డు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత శాఖ ఇంజినీర్లను అభినందించారు. కోనేరును పరిశీలించి ఇస్కాన్ ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని సందర్శించి పనితీరు గురించి ఆర్‌టిఒ కరుణసాగర్‌ను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగింపు

ధర్మవరంలో వినూత్న నిరసన

కదిరిలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

వెంకటేశ్వరా నీవైనా మాసమస్యలు పరిష్కరిం చేలా వైసిపి ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా గురువారం సమ్మె శిబిరం వద్ద గోవింద నామస్మరణ చేస్తూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సమ్మెకు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు పట్టణ నాయకులు బాలాజీ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ 24 రోజులుగా అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకపోగా ఆ సమ్మెను విచ్ఛిన్నం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. శుక్రవారం లోగా సమ్మె విరమించి విధులల్లోకి వెళ్లకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు నోటీసులు పంపడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఏ చర్యకైన సిద్ధమన్నారు. ఇంకా అంగన్వాడీల ఉద్యమం మరింత ఉగ్రరూపం దాల్చుతుందన్నారు. ఈకార్యక్రమంలో అంగనవాడీలు పోతక్క, దీనా, మాంచాలనిదేవి, అనిత, కృష్ణవేణి, భువనేశ్వరి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : 24 రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే పట్టించుకోకపోవటం అన్యాయమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రాలలో కలెక్టరేట్ ముట్టడిలో పోలీసుల నిర్బంధాన్ని నిరసిస్తూ గురువారం ఆర్ అండ్ బి బంగ్లా నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బిరెడ్డి, సిఐటియు నాయకులు జిఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తక్, నాగరాజు, నాయకులు బాబ్జాన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, చంద్రకళ, శారద, మాధవి, సుజాత, లక్ష్మీదేవి, వకుల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీల సమ్మె 24వ రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్వాడీలు నినాదాలు చేశారు. సిఐటియు నాయకులు బ్యాల్ల అంజి మాట్లాడుతూ ప్రభుత్వానికి అంగన్వాడీల ఘోష వినపడలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేదాకా ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పరిగి : అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను ఆపేది లేదని సెక్టార్ నాయకురాలు పద్మ వెల్లడించారు. అంగన్వాడీ కార్యకర్తలతో వెట్టి చాకిరి చేయిస్తున్న ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి తాము పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వ స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లింగారెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకులు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని దండాలు పెడుతూ నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ సందర్శించి అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, అనిత, శ్యామలగౌరీ, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : సోమందేపల్లిలో అంగన్వాడీలు సమ్మెను యథావిధిగా కొనసాగించారు. న్యాయ మైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమం లో యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సభ్యులు అనురాధ, చంద్రకళ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ శిబిరం వద్దనే వంటా వార్పు కార్యక్రమం చేపట్టి రోడ్డుపైనే భోజనం చేసి నిరసన వ్యక్తం చేశారు. దీక్షలో సిఐటియు నాయకుడు మహబూబ్‌ఖాన్, యూనియన్ లీడర్లు నాగవేణి, అనసూయమ్మ, మంజుల, చంద్రకళ, నాగరత్నమ్మ, సారక్క పాల్గొన్నారు.

కొత్త ముఖాలతో కదిరి వైసీపీలో చిచ్చు..!

నాయకుల్లో పెరుగుతున్న వైరం
హస్తం గూటికి వైసీపీ అసమ్మతినేతలు ..?

ప్రజాశక్తి కదిరి అర్బన్

కదిరి నియోజకర్గంలో వైసిపిలో కొత్తముఖాలు తెరమీదకు వస్తుండటంతో ఆపార్టీలో చిచ్చు రాజుకుంది. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ జెండా పట్టుకొని కష్టపడిన వారికి కాకుండా ఇతరులకు ప్రాధాన్యత ఇస్తుండటంతో పార్టీలోకి నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ప్రస్తుతం కదిరి నియోజకవర్గ నూతన సమన్వయకర్తగా మక్బుల్ అహ్మద్‌ను నియమించారు. అయితే ఆపార్టీలోకి ఓ గ్రూపు దీన్ని జీర్ణించుకోలేక పోతోంది. వీరు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చర్చలు జరుగుతున్నాయన్న వ్యాఖ్యానాలు పట్టణంలో జోరందుకున్నాయి. మరోవైపు నూతన సమన్వయకర్త మక్బూల్ కదిరి నియోజకవర్గంలో వైసిపి ముచ్చటగా మూడవసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొడుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి మండల స్థాయి నాయకుల వరకు మొన్నటి వరకు బిఎస్ మక్బూల్ కు వ్యతిరేకంగా సమావేశాలు జరిపి నేడు నూతన సమన్వయకర్తకు వచ్చి సత్కరిస్తున్నారు. వీటిని బట్టి చూస్తే ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉన్నట్లు నటించి ప్రస్తుతం నూతన సమన్వయకర్తకు వత్తాసు పలుకుతుండటంపై అసంతృప్తవాదుల్లో ఆగ్రహం తెప్పిస్తోంది. ఈ గ్రూపుల వల్ల విభేదాల వల్ల వైసీపీ వచ్చే ఎన్నికల్లో మునుగుతుందా తేలుతుందా అన్న అనుమానాలు రాజకీయ విశ్లేషకుల్లో వెల్లడవుతున్నాయి. ఈనేపథ్యంలో కొందరు కిందిస్థాయి నాయకులు తాము ఎక్కడ పోతే ఎలాంటి నష్టం ఏర్పడుతుందో అన్న అభద్రతాభావంలో ఉన్నారు. అయితే సీనియర్ మైనార్టీ నాయకులు ఇప్పటికే తీవ్ర మనస్థాపం చెంది ఎవరికి చెప్పుకోలేక ఎక్కడికి వెళ్లలేక తీవ్ర మనస్థాపనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పగ్గాలు చేపడుతుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని అసమ్మతి నాయకులు హస్తం గూటికి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎన్నికలు వస్తే కదిరి గుర్తుకొస్తుంది...

ప్రజాశక్తి కదిరి టౌన్

రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కదిరి నియోజవర్గంలోకి ఆయారాం.. గయారాం నేతలు వస్తున్నారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడని చెప్పుకుంటున్న లయన్ ఖాసీంఖాన్ కదిరిలో అడుగుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు వెళ్లిన ఆయనరే ప్రస్తుతం ఎన్నికల ఘంటారావం మోగుతున్న తరుణంలో కదిరి ప్రజలు హఠాత్తుగా గుర్తుకు వచ్చారు. 2019 ఎన్నికల్లో వైసిపి టికెట్‌ను ఆశించిన ఆయనకు నిరాశ ఎదురవడంతో కాంగ్రెస్ పార్టీ తరుపున ఒరిలో దిగి ఓటమి చెందారు. అప్పటి నుంచి కనుమరుగైన ఆయన ప్రస్తుతం కదిరిలో వాలిపోయారు. అదరాబాదరా సమావేశాలు నిర్వహించి, సొంత ప్రయోజనాల కోసం తన ఉనికిని కాపాడుకునేందు కోసం తన ప్రయత్నాలు చేపట్టారు. కష్టాల్లో ఉన్న కాంగ్రెస్‌ను పట్టించుకోని ఆయన ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు మంచిరోజులు వస్తున్నాయన్న తాపత్రయంతో కదిరికి వచ్చి నానా హంగామా చేస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఈయన పార్టీకోసం వచ్చారా, సొంత ప్రయోజనాల కోసం పబ్బం గడుపుకోవడానికి వచ్చారా అని ప్రశ్నిస్తున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడం తెలుసుకొని పార్టీకి పూర్వవైభం వస్తుందన్న ఆశతోనే కదిరిలో ఎన్నికల కట్‌చీప్ వేస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.కదిరి ప్రజల అభివృద్ధే తమ ధ్యేయమని చిలక పలుకులు పలుకుతున్న ఆయన ఇన్ని రోజులు ఎక్కడ ఉన్నారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడుతున్నారు. కావు కావు మంటూ కదిరికి వచ్చి కాంగ్రెస్‌కు జై అంటే జెండా మోయడానికి కార్యకర్తలు సిద్ధంగా లేరని విషయాన్ని కూడా ఆయన తెలుసుకోవాలని హితవు పలుకుతున్నారు.

ఆయారం.. గయారం ఆయన నైజం
సీజనల్ రాజకీయాలకు అందెవేసిన చేయి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : పరిటాల

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్రకు తొలిరోజే ప్రజలు, టీడీపీ నాయకులు బ్రహ్మరథం పట్టారు. ధర్మవరానికి ఒక మ్యానిఫెస్టో తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు పరిటాలశ్రీరామ్ ప్రజాచైతన్య పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం గుట్టకిందపల్లిలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు పరిటాల శ్రీరామ్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపామని, ఆ తీర్మానంలో తొలిసంతకం చేసింది మాజీ మంత్రి పరిటాలను సునీత అని గుర్తుకు చేశారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రతి రోజు గుడ్‌మార్నింగ్ అంటూ రెండుగంటలపాటు ఉదయం షో చేస్తుంటారని ఎద్దేవా చేశారు. ఆయనకు ప్రజాసమస్యలు మీద నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎప్పుడో సమస్యలను పరిష్కరించేవారన్నారు. ఆయనకు చిత్తశుద్ధలేని కారణంగానే పాదయాత్ర తొలిరోజే వందలాది మంది తమ సమస్యలు వినిపిస్తున్నారన్నారు. ప్రజలనుంచి వచ్చిన ప్రతి సమస్యను గుర్తుపెట్టుకొని టీడీపీ అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పేదల పక్షపాతి వైసిపి...

ధర్మవరంలో పింఛను అందజేస్తున్న నాయకులు

హిందూపురంలో పింఛను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వం పేదల పక్షపాతి అనిమాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, 33వ వార్డ్ ఇన్‌ఛార్జి బడన్నపల్లి కేశవరెడ్డి అన్నారు. 33వ వార్డు సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం భాగ్యలక్ష్మి, కేశవరెడ్డి చేతుల మీదుగా దాదాపు 370 మంది లబ్ధిదారులకు పెంచిన పింఛను మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : నిరుపేద పింఛను దారులకు ఆర్థిక భరోసా కల్పించడానికి వైసిపి ప్రభుత్వం జనవరి నుండి పింఛను సొమ్మును 3వేల రూపాయలకు పెంచినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని ఈదులపల్లి, రంగాపురం బండ్లపల్లి, దామానుపల్లి, మర్తాడు తదితర గ్రామాలలో పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, మర్తాడు ఈదులపల్లి సర్పంచులు శివారెడ్డి. ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీలు భవానికృష్ణారెడ్డి, వెంగళరెడ్డి, గ్రామ సచివాలయాల కార్యదర్శి భాస్కర్, రంజిత్ రెడ్డి, ముదిగుబ్బ సర్పంచు లక్ష్మీదేవి చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు

హిందూపురం : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సంక్షేమ పథకాలతో బడుగు బలహీన నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి అన్నారు. గురువారం రూరల్ మండలం కిరికెర పంచాయితీ వీవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వైయస్సార్ పింఛన్ల కానుక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, పింఛన్ కార్డు, రూ.3వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరేంద్ర కుమార్, జెడ్పీటీసీ నాగభూషణప్ప, మండల కన్వీనర్ రాము, సర్పంచులు ఆనంద్, శ్రీనివాస్ రెడ్డి, సరస్వతి ఆదెప్ప, ఎంపీటీసీలు కవితా మంజునాథ్, రామకృష్ణారెడ్డి, బాలచంద్రతో పాటు నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

5 నుంచి జగనన్న సురక్ష

పుట్టపర్తి రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం రెండవ విడత కార్యక్రమాన్ని ఈనెల 5 నుండి మండలంలో చేపట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో గ్రామ సచివాలయాల వారిగా మార్చి3 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సహకరించాలని కోరారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

పరిగి : ఓటు హక్కు నమోదు, వినియోగంపై స్థానిక తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీని గురువారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వైఎస్ఆర్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

బత్తలపల్లి : మండలంలోని అన్ని పంచాయతీల్లో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపైన అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎంపీడీవో సాయిమనోహర్ గురువారం సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇఒఆర్‌డి దివాకర్, మండల ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వరలక్ష్మి, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష – 2 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలపై సమీక్షించారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలోని గరిశలపల్లిలో కంది పంటలో అధికారులు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. గ్రామంలోని రైతులు విమలమ్మ, లక్ష్మన్న సాగు చేసిన కంది పంటలో ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ, వ్యవసాయ శాఖ అధికారులు ఉపేంద్రరెడ్డి, రవికుమార్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ జిల్లా కోఆర్డినేటర్ చంద్రమోహన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'బాబు'ను కలిసిన బిసి నాయకులు

పుట్టపర్తి క్రైమ్ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును సత్యసాయి జిల్లా బీసీ నాయకులు కలిశారు. గురువారం విజయవాడలోని మంగళగిరి టిడిపి కార్యాలయంలో చంద్రబాబును కలిసి సత్యసాయి ఫోటోలు బహుకరించారు. టిడిపి హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని ప్రస్తుతం జరగనున్న ఎన్నికలలో కూడా బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు జిల్లా అధ్యక్షులు కొట్టాల శ్రీరాములు, కురవ సంఘం జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్థసారథి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

ముదిగుబ్బ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల రాకతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం లభిస్తుందని ఆపార్టీ మండల కన్వీనర్ ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి షర్మిల రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆమె తన తండ్రి అడుగుజాడలలో రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి తోడ్పాటు అందిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఈసమావేశంలో నాయకులు నిస్సార్ అహ్మద్, ఆదినారాయణ, వీరభద్ర, నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజయానికి అంధత్వం అడ్డుకాదు

ప్రజాశక్తి-హిందూపురం

విజయానికి అంధత్వం అడ్డుకాదని, మనోధైర్యంతో ముందుకు సాగితే విజయం వెంటే ఉంటుందని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ ఆఫ్తాబ్, డాక్టర్ వెంకటరమణ అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని గురువారం సేవామందిరంలోని అంధుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైద్యులతో పాటు దీప్తి పాఠశాల అధ్యక్షులు దీపూ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అంధులకు లిపి కనుగొని వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి లుయీ బ్రెయిలీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కరీంతో పాటు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛను మొత్తాన్ని పెంచాలి

రొద్దం : వికలాంగులకు పింఛను మొత్తం పెంచాలని రొద్దం పంచాయతీ దివ్యాంగుల కార్యదర్శి రాజేష్ గురువారం డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువుల పింఛను మొత్తాన్ని రూ. 2వేల నుంచి రూ. 3వేలకు పెంచుకుంటూ వచ్చిందని, వికలాంగులకు మాత్రం పెంచలేదని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వికలాంగు పింఛను రూ. 5వేలు చేయాలని డిమాండ్ చేశారు.

In the court of the Hon'ble principal junior civil judge:Kadiri
OS No.581/2021

Between:-
Busireddy Janardhana Reddy ...... Plaintiff.
And
Ganginepalle Narayana @ Narayanappa... ..... Defendant.

ప్రతివాదికి దావా సమను నోటీసు

To
Ganginepalle Narayana @ Narayanappa S/o Ganginepalle Gangappa, 48 yrs, R/at D.No. 9/47, Sangeethampalle H/o Mohammadabad, Kassamudram Post, Amadaguru Mandalam, Sri Satya Sai dt., A.P.,
పై దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 08-01-2024 తేదీన ఉ॥ 10.30 గం॥లకు వాయిదా వేసినారు. మీరు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కానీ సదరు కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలయును, లేనిపక్షంలో మీ పరోక్షంగా దావాను తీర్మానం చేస్తారు అని తెలియచేయడమయినది.
(కోర్టు వారి ఉత్తరువుల మేరకు)

వాయిదా తేది : 08-01-2024
ఇట్లు: బండారు కృష్ణమూర్తి
వాదిపరము న్యాయవాది, కదిరి
సెల్: 9618465758

కర్నాటక మద్యం స్వాధీనం.. ఇద్దరు అరెస్టు

గోరంట్ల రూరల్ : కర్నాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒకరిని, కర్నాటక మద్యం విక్రయిస్తుండగా మరొకరిని అరెస్టు చేసి వారి నుంచి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. మండల పరిధిలోని పాలసముద్రం క్రాస్ వద్ద కర్నాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి సుకన్యను అరెస్టు చేసి, ఆమె నుంచి మద్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఒడి చెరువు మండలం చౌడంపల్లి గ్రామానికి చెందిన బండి ఆదినారాయణ ద్విచక్ర వాహనంపై కర్నాటక నుంచి మద్యం తరలిస్తుండగా కోరేవాండ్ల పల్లి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకొన్నారు. అతడి నుంచి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని బైక్ సీజ్ చేసి కేసు నమోదు చేసి ఇద్దరినీ పెనుకొండ కోర్టులో హాజరు పరచినట్లు వెల్లడించారు. మండలంలో కర్నాటక మద్యం విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని, ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

కదిరి టౌన్ : కదిరి పట్టణంలోని మెప్మాకు సంబంధించి జరిగిన రూ. 2 కోట్ల అక్రమాలపై విచారణ జరిపించాలని మహిళ సంఘాల సభ్యులు కోరారు. ఈ మేరకు వారు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగిపోయిన మహిళా సంఘాలకు డబ్బులు ఎలా జమచేస్తారని ప్రశ్నించారు. మెప్మా టీఎంసీ, సిఒ, ఆర్పీ సంతకం లేనిదే బ్యాంకు వారు నగదు జమచేయరనిఅలాంటిది సభ్యులు కు సంబంధించిన వైస్సార్ ఆసరా ఇతర డబ్బులు రెండు కోట్ల రూపాయల వరకు నగదు ఎటువంటి లావాదేవిలు జరుపని డీఫాల్ట్ ఖాతాలో జమ అయిందని వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ అక్రమాల పై విచారణ చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉమాదేవి, రమణమ్మ, ఫరీదా, శారదా, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

బత్తలపల్లి : మత్తు, డ్రగ్స్ పదార్థాలకు, వ్యవసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. అదే విధంగా ఈవ్ టీజింగ్, ఉన్నత విలువలు. మహిళలపై అత్యాచారాలు తదితర అంశాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

సోమందేపల్లి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని ఘనగిరి పాఠశాలలో ప్రతి నెలా నాల్గవ ఆదివారం మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెవివి సభ్యులు కె.హరి, ఉపాధ్యాయులు సోమశేఖర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు మూర్ఛ వ్యాధి లక్షణాలు, మనిషిపై వ్యాధి ప్రభావం, తదితర విషయాలను వివరించారు.

జెవివి క్యాలెండర్ ఆవిష్కరణ : జెవివి ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ ఆంజనేయులునాయక్ ఆధ్వర్యంలో జెవివి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి సభ్యులు కె.హరి, సోమశేఖర్, భాస్కర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల పక్షపాతి సిఎం జగన్ : వైసిపి

మడకశిర : పింఛను మొత్తాన్ని పెంచి నిరుపేదలను ఆదుకున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎంపిపి కవిత సత్యనారాయణరెడ్డి, వైసిపి తాలూకా సోషియల్ మీడియా కన్వీనర్ జయరాజ్, పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం నిర్వహించిన 'వైఎస్ఆర్ పింఛను కానుక' పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్, మండల అధ్యక్షులు రామిరెడ్డి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, జడ్పీటీసీ సరోజమ్మ మూర్తి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు రామచంద్రరెడ్డి, వెంకటలక్ష్మమ్మ, సర్పంచులు గీతా, జవాన్‌మూర్తి, రంగనాథ్, ఎడిసిసి బ్యాంక్ డైరెక్టర్ కరణ్య రాజశేఖర్, నాయకులు ఈశ్వర్, మంజునాథ్ పాల్గొన్నారు.

పెనుకొండ : నవరత్నాలులో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, ఎంపిపి గీతారామ్మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయం-1 పరిధిలోని లబ్ధిదారుల కోసం 'వైఎస్ఆర్ పెన్షన్ కానుక' పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, ఎంపిడిఒ శివశంకర్, ఎంఇఒ చంద్రశేఖర్, వైసిపి టౌన్ కన్వీనర్ నరసింహ, కౌన్సిలర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం'

ధర్మవరం టౌన్ : రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా 35వ వార్డు బాలాజీ నగర్‌లో పల్లెకు పోదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలు డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్ చింతా మారుతి ప్రసాద్, సచివాలయ కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ చింతా పెద్ద ఎల్లయ్య, కేత లోకేష్ తో పాటు మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వంటావార్పులో న్యాయవాదులు

హిందూపురం : ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసే విధంగా రూపొందించిన భూహక్కు యాజమాన్య చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నిరసన కార్యాచరణలో భాగంగా గురువారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, హిదయతుల్లా ఖాన్, న్యాయవాదులు సుదర్శన్, సత్యనారాయణ, సిద్దు, శ్రీరాములు, నాగరాజు రెడ్డి, నాగప్ప, రామిరెడ్డి, వెంకటేష్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

చిలమత్తూరు : నేటి యువత క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు వస్తాయని అందుకోసమే ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందనిరాష్ట్ర క్రీడలు యువజన సర్వీసు రోడ్లు భవనాల శాఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న తెలిపారు. ఈ మేరకు ఆయన గురవారం చిలమత్తూరు, పెనుగొండలో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొన్నారు మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వాలీబాల్ క్రీడను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ భాస్కర్, ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి ఎంపిటిసిలు రాఘవేంద్ర రెడ్డి, షాకీర్, సర్పంచులు సంధ్య జయశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.